విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 16 మార్చి 2025 | 8 పేజీలు

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిత్తూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు :డిఆర్ఓ మోహన్ కుమార్

విశాలాంధ్ర - చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. శనివారం చిత్తూరులోని జిల్లా సచివాలయంలో టెన్త్ పరీక్షలపై విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలు సోమవారం నుంచి వచ్చే నెల ఒకటవ తేదీ వరకు జరుగుతాయని ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి

2

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను

కార్మిక వర్గానికి వివరిద్దాం

- పోరాటలకు సన్నదం చేద్దాం : ఓబులేసు
- కార్మికులను నాయకులుగా తయారుచేసి పోరాటలకు పదును పెడదాం
- ప్రభుత్వ మెడలు వంచుదాం
- ఏఐటీయూసీ జిల్లా నిర్మాణ రాజకీయ శిక్షణా తరగతులు తలకోనలో ప్రారంభం

ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను కార్మిక వర్గానికి వివరించి పోరాటాలకు సన్నద్ధం చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం ఏఐటీయూసీ తిరుపతి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు రెండు రోజులపాటు తలకోనలో గుర్తించిన కార్యకర్తలకు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, సిపిఐ రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డిలు మాట్లాడుతూ ఏఐటీయూసీకి 105 సవత్సరాల చరిత్ర ఉందన్నారు.

- వార్త మెయిన్ పేజీలో

టిడిపి నేత దారుణ హత్య

- వేట కొడవలితో దాడి చేసిన వైసిపి నేత
- ముందస్తు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- పోలీసుల నిర్లక్ష్యంతోనే హత్య అన్న టిడిపి నేతలు

పుంగునూరు సిఐ సస్పెండ్

విశాలాంధ్ర - పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన టిడిపి నేత రామకృష్ణ వైసిపి నాయకులు నుండి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని

2

- వార్త మెయిన్ పేజీలో

పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- జిల్లా ఇన్‌ఛార్జి ప్రత్యేక అధికారి కోన శశిధర్

విశాలాంధ్ర- తిరుపతి : స్వర్ణాంధ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నందు నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ కమిషనర్ జిల్లా ఇన్చార్జి స్పెషల్ అధికారి కోన శశిధర్, జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య.జిల్లా ఇన్చార్జి ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. శుభ్రతపై ప్రతి ఒక్కరు లోను మార్పు అనేది రావాలని అన్నారు. సమాజంలో ఏ మార్పు తీసుకొని రావాలన్నా పారిశుద్ధం, స్వచ్ఛంద, అవినీతి నిర్మూలనకు అయిన అధికారులు, ప్రజలు భాగస్వామ్యంగా ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరికీ, తమ తల్లిదండ్రులకి స్వచ్ఛత పైన అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలు, పాఠశాలలు, రైల్వేస్టే షన్, బస్టాండ్, ఇతర ప్రదేశాల్లో ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు. శుభ్రత మీద ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలనేది స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఇంటి పరిసరాలు, ప్రభుత్వ స్థలాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పాటించాలనే పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రెడ్యూస్, రియుస్, రీసైకిల్ కాన్సెప్ట్ ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకొని ముందుకు తీసుకెళ్లాలని పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్‌ని ప్రతి ఇంటి, పరిసరాలలో వాడకుండా చూడాలని,డంప్పు చేయకుండ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కొనకుండా ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ మనం తీర్చిదిద్దాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటింటికి వెళ్లి పొడి, తడి చెత్త సేకరణ వేరువేరుగా సేకరించాలని తెలిపారు. తూకివాకంలో తడి, పొడి ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఉన్నాయని తెలిపారు. గతంలో తిరుపతి లోని చెత్తను రామాపు రంలో 25 ఎకరాలలో డంపింగ్ చేసేవారు అని తెలిపారు. నగరంలో ఎక్కడ కూడా 24 గంటలు చెత్త కుప్పలు నిల్వ ఉండకూడదని తెలిపారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణ కోసం వాహనాలు వస్తున్నాయని చెత్తను వేరుచేసి వారికి ఇవ్వాలని తెలిపారు. నగర పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపుని చ్చారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగిం చకుండా తగు చర్యలు చేపడుతున్నా మన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే

2లో

పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి) దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేసేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అందరి చేత స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని విద్యార్థులు సంబంధిత అధికారులతో కలిసి జెండా ఊపి ర్యాలీగా ఎన్టీఆర్ స్టేడియం వరకు వెళ్లారు. అనంతరం న్యూ బాలాజీ కాలనీలో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన (రెడ్యూస్ రీ యూజ్ రీసైకిల్) సెంటర్ ను జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.ముని కృష్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమా, రిజిస్టర్ రజని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి) మధ్యాహ్నం 12.45 గంటల గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 21248 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 20954 మంది ప్రైవేట్ విద్యార్థులు 294 మంది ఉన్నట్లు వివరించారు. వీరి కోసం 118 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలను అత్యంత క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించామని అక్కడ సీసీ కెమెరాలతో నిత్యం నిఘా ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ కేంద్రం వద్ద పోలీస్ 163 ఆర్డినెన్స్ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయని అయితే విధిలేని పరిస్థితుల్లో ఆలస్యంగా వచ్చిన వారికి 10 గంటల వరకు గ్రేస్ పిరుడ్ గా పరిగణించడం జరుగుతుందన్నారు. అయితే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకుని పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల్లో కాపీయింగ్ నివారించడానికి 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 40 సిటింగ్స్ స్క్వాడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షల సందర్భంగా ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవడానికి జిల్లా కేంద్రంలో ని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 9032185001 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి తీసుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1190 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు సౌకర్యార్థం అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే జిల్లాలో 20 పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 1165 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్షల సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం జరిగిందని, విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో తమ హాల్ టికెట్లను చూపించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పుంగనూరు సిఐ సస్పెండ్

(మొదటి పేజీ తరువాయి) పలుమార్లు పుంగనూరు అర్బన్ సీఐ శ్రీనివా సులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన శనివారం రోజున టిడిపి నేత రామకృష్ణ వైసీపీ నేత వెంకటరమణ చేతిలో హత్య కావడం తో దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ ఎటువంటి విచారణ లేకుండా విధులు సక్రమంగా నిర్వహించక పోవడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

అధికారులతో సమావేశమైన విభు నాయర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్, న్యూ ఢిల్లీ విభు నాయర్ శనివారం తిరుమల, తిరుపతి పర్యటనలో భాగంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో తిరుపతి కలెక్టరేట్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకం కింద తిరుపతి జిల్లా నందు ఎన్నుకోబడిన మూడు గ్రామాల గురించి చర్చించడం, అదనంగా గ్రామాలను చేర్చడం పై ప్రతిపాదన చేయడం జరిగినది, గిరిజన గురుకుల పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పై ప్రతిపాదించడం జరిగినది, కేంద్ర ప్రభుత్వ నిధులు సరైన సమయంలో ఖర్చు చేసిన వాటికి సంబంధించిన ఖర్చు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశం లో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డైరెక్టర్ అఫ్ ట్రైబల్ వెల్ఫేర్ సదాభార్గవి, ఎం.మల్లికార్జున నాయక్, ఎం.సరస్వతి, ఎస్, ప్రతిభ భారతి, జి.చంద్రిక, బి.మల్లికార్జున్‌రెడ్డి, ఎన్. శ్రీనివాసరావు, బి.సూర్యనారాయణ, ఎం.ఆర్.సి.వి. గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యమే హత్యకు కారణం

- కక్షపూరితమైన ఫ్యాక్షన్ రాజకీయాలు తగవు
- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం
- టీడీపీ నేత హత్యను ఖండించిన ఎమ్మెల్యే అమర్

విశాలాంధ్ర -పలమనేరు: పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత రామకృష్ణ హత్య చాలా దారుణమని మాజీ మంత్రి పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమరనాథ రెడ్డి ఖండించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ, అతని కుమారుడు సురేష్ ను అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు మాజీ వాలంటీర్ వెంకటరమణ రాజకీయ కక్షతో శనివారం ఉదయం వేట కొడవలితో దాడి చేయగా వారిరువురూ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర గాయాలైన తండ్రి కుమారులను స్థానికులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మృతుని కుమారుడు సురేష్ ను మరియు వారి కుటుంబీకులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వైకాపా నేతలు కక్షపూరిత రాజకీయాలను వీడలేదన్నారు. రామకృష్ణ మృతికి పోలీసుల నిర్లక్ష్య వైఖరే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పని చేసిన పోలీస్ అధికారులు ఇప్పటికీ ఉదాసీనంగా వ్యవహరించడమే ఇలాంటి ఘటనలకు కారణమన్నారు. ప్రశాంతమైన ఈ ప్రాంతాలలో కక్షపూరితమైన ఫ్యాక్షన్ రాజకీయాలు తగదని హితవు పలికారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిర్లక్ష్య వైఖరి చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకొనేలా ముఖ్యమంత్రికి తెలియజేస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్ర, తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు మరియు పుంగనూరు,మదనపల్లితెలుగుదేశంపార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరించరా

- వసూలు చేసిన పన్ను నగదు ఏమైపోయిందో
- ట్యాంకు నిర్మాణంపైనా విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర- పుత్తూరు: పట్టణంలో రూ.55 కోట్లతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనులపైనా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. నగరి శాసనసభ్యులు గాలి భానుప్రకాష్ ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగిన నేపథ్యంలో రూ.45 లక్షలతో చేపట్టిన మరమ్మత్తుల పనుల్లో అవినీతి జరిగిందంటూ శాసనసభలో ప్రస్తావించి, విచారణకు ఆదేశించడాన్ని ఆహ్వానిస్తున్నామని అలాగే ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపైనా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, అదిశగా ఎమ్మెల్యే శాసనసభలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకులోకి నీరు చేరిన తొలి ఏడాదే కట్ట కుంగిపోయి పుత్తూరు ప్రజల ప్రాణాలమీదికి వచ్చిందని గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఆనాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా జిల్లా కలెక్టర్, పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులను అప్రమత్తం చేసి మరమ్మత్తులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు. అనాటి మరమ్మత్తులపై విచారణ చేపట్టాలన్న ప్రస్తుత ఎమ్మెల్యే భాను ప్రకాష్ నిర్మాణ పనులపైనా విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు.

టెబుల్ అజెండాగా 4వ వార్డును ఖాళీగా ప్రకటించాలి: పుత్తూరు మున్సిపాలిటి కౌన్సిల్ ఎన్నికల్లో 4వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన కేశవాచ్చారి ఎన్నికను రద్దు చేస్తూ పుత్తూరు కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆ వార్డును ఖాళీగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్సీపీ కౌన్సి లర్లు టెబుల్ అజెండాను ప్రవేశపెట్టారు. ఈ మేరకు వైఎస్సార్సీపీ కౌన్సిలర్ వనిత విప్ జారీ చేశారు. విప్ లేఖను చైర్మన్, వైస్ చైర్మన్లకు వారికి అందజేశారు. మూడు అంశాలనే ఆమోదించిన కౌన్సిల్‌తిమ్మాపురం వార్డుకు చెందిన కౌన్సిలర్ మున్సిపల్ అధికారాన్ని నిలదీశారు ప్రజల చేత ముక్కు పిండి వసూలు చేస్తున్న ఇంటి పన్నులు కులాయి పన్నులు హౌస్ టాక్స్ పన్ను లను ఆ నగదును ఏం అవుతుంది మా వార్డుల్లో డ్రైనేజీ సమస్యలు వీధిలైట్లు మరమ్మతులకు గురై రోజు రోజుకి అనేక సమస్యలు పెరిగిపోతు న్నాయి వీటికి సమాధానం చెప్పి నెక్స్ట్ అజెండాకి వెళ్ళండి లేదంటే మా వార్డు నుండి ఏ పనులు కట్టమని ఆమె డిమాండ్ చేశారు పుత్తూరు కూరగాయల మార్కెట్, బస్టాండ్ జంతువధుకాల వేలం పాటలు, మున్సిపల్ సిబ్బంది జీతభత్యాలు, 4 వార్డు కౌన్సిల్ స్థానం ఖాళీ అన్న మూడు అంశాలను మాత్రమే ఆమోదిస్తున్నట్లు చైర్మన్ హరి ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. మంజు సధగౌర్, దీరుఈ చంద్రశేఖర్రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు, ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలు

- జిల్లాలో 3 పరీక్ష కేంద్రాలలో హాజరు కానున్న 1,634 అభ్యర్థులు
- పరీక్షలకు పూర్తయిన ఏర్పాట్లు - ఇన్చార్జి డిఆర్ఓ వెల్లడి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ఈనెల (మార్చి) 16, 17న జిల్లాలో జరగనున్న ఏపీ పీఎస్సీ, ఏపీ ఫారెస్ట్ సర్వీస్ (స్క్రీనింగ్ టెస్ట్), ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పోస్టులకు వ్రాత పరీక్షలు, కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ఇన్చార్జి డిఆర్ఓ దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లోని పరిపాలన అధికారి ఛాంబర్ నందు సంబంధిత అధికారులతో నేడు, రేపు జరగనున్న ఏపీ పిఎస్సి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16 వ తేదీన ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12 వరకు జరుగుతాయని, 17 వ తేదీన ఉదయం 9.30 నుండి ఉదయం 12 వరకు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 వరకు పరీక్షలు నిర్వహించబడతాయని పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహిస్తున్నమని ఇన్చార్జి డిఆర్ఓ తెలిపారు. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో (1) 9105 ఐఓఎన్ డిజిటల్ జోన్ ఐడిజడ్ జూ పార్క్ రోడ్, చెర్లోపల్లి గ్రామం, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి. (2) 1004 శ్రీ వెంకటేష పెరుమాళ్ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్విఎస్ నగర్, కార్వేటి నగరం రోడ్, చిన్నరాజ కుప్పం, పుత్తూరు మండలం, తిరుపతి. (3) 1560 ఎన్బికేఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ %d% టెక్నాలజీ, విద్యానగర్, కోట మండలం, తిరుపతి మొత్తం 3 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందనీ 1,634 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు.

ఈ పరీక్షల కొరకు ముగ్గురు డిప్యూటీ తాసిల్దార్ లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని, పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం,విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగునీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ నుండి సిహెచ్. సాయి ప్రకాశ్, అసిస్టెంట్ సెక్రటరీ (మానిటర్), సిహెచ్ యోగేశ్వర రావు, సెక్షన్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఎచ్చెర్ల శాసనసభ్యులు ఈశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడు, కుప్పం హరీష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సజ్జ హరీష్, పీఆర్వో సాయి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు వెంకటేష్,రు, పట్టణ ప్రధాన కార్యదర్శి కటికం చంద్రశేఖర్, సక్క హరీష్, రవి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను పీడిస్తే చర్యలు తప్పవు

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. కొన్ని సమస్యలను అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అధికారుల సక్రమంగా పనిచేస్తే గ్రీవెన్స్ డేకి ప్రజలు ఇంతమంది ఎందుకు వస్తారని కొన్ని శాఖలు అవినీతి మయమైపోయాయని డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నారని పేదవారిని ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారని వారిపై కలెక్టర్ మంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని అవసరమైతే ప్రజలతోనే ఆఫీసుల ముందు బయట ఇస్తామని తెలిపారు. సక్రమంగా అధికారులు పనిచేయకుండా ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపిస్తున్నారని ప్రజల్లో ప్రభుత్వంపై చెడ్డ పేరు వస్తుందన్నారు.

కరాటేలో స్వర్ణాంధ్రభారతి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు రెండవ పట్టణం మాళవ్యానగర్లోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఇటీవల నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొని అనేక బహుమతులు పతకాలు సంపాదించారు. ఇందు లో 35 మంది పాల్గొని, 20 బంగారు పతకాలు మరియు 15 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా, పాఠశాల ప్రిన్సి పాల్ నవ కోటి నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో, విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. అందుకు అవసరమయ్యేటటువంటి పోషకాహారాలను తీసుకుంటూ శారీరక వ్యాయామాన్ని చేస్తున్నట్లయితే వారికి తగినంత శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థిరత్వం అనేది ఏర్పడి తమ యొక్క చదువును సక్రమంగా చదివేటటువంటి పరిస్థితుల్లోనికి వస్తారని పేర్కొన్నారు. దీనికి సహకరించినటువంటి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పథకాలు సాధించిన టువంటి విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సరైనటువంటి శిక్షణ ఇచ్చి వారికి పథకాలు రావడానికి దోహద పడినటువంటి కరాటే గురువులు ఇబ్రహీం , నాగరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. నవకోటి నాయుడు , పాఠశాల డీన్ సి.డి. సునీల్ రాజు పాఠశాల అకాడమీ కోఆర్డినేటర్ కె.హరికృష్ణ , పాఠశాల ప్రైమరీ ఇన్చార్జి సి.సింధు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 25 మంది ఎంపిక

విశాలాంధ్ర - తొట్టంబేడు: శ్రీకాళహస్తి పట్టణంలోని స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జేకేసీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 25మంది ఎంపికయ్యారు. ఈ ఉద్యోగమేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా... సుమారు 50మంది నిరుద్యోగులు హాజర య్యారు. కంపెనీల ప్రతినిధులు వీరికి ముఖాముఖి నిర్వహించి... అందులో ప్రతిభ చూపిన 25మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకు న్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. వీరికి నెలసరి వేతనం రూ. 15వేల నుంచి రూ. 20వేలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజానాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, జేకేసీ కో-ఆర్డినేటరు టి.గంగారాం, జేకేసీ ఎఫ్టీఎం పి.గిరిజమ్మ, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలో ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి . గూడూరు పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు గాని లేకుండా ప్రశాంతంగా ముగిశాయి.. ఈ సందర్భంగా పరీక్ష చివరి రోజు కావడంతో మధ్యాహ్నం నుంచి విద్యార్థుల కోలాహలంతో నిండిపోయింది.

మొక్కలు నాటుదాం పర్యావరణం కాపాడుదాం

- ఎం.ఈ.ఓ ముని సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మొక్కలు నాటుదాం పర్యావరణం కాపాడుదాం కాలుష్య నివారణకు చేయి చేయి కలుపుదాం అంటూ రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల మన సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని చిన్న పాలివేడు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పురాణ వాయువు ఇచ్చే చెట్లు కాపాడితే భావితరాల కోసం పర్యావరణాన్ని రక్షించాలి కాలుష్య కోరలు ప్రకృతినీ పర్యావరణాన్నీ, మానవ ఆరోగ్యాన్నీ అనేక రూపాల్లో ప్రభావితం చేస్తోంది. ఒకప్పుడు అందంగా అహ్లాదంగ స్వచ్ఛంగా ఉన్న వాతావరణం కాలక్రమేనా కనుమరగైపోతోందన్నారు. అవసరంలేని ఆధునికతతో, రకరకాల వ్యర్థాలతో, కాలుష్యాలతో జీవావరణ వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతోంది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాంమానవ మనుగడ సాఫీగా ఉండాలంటే ప్రకృతిని పదిలంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడమే కాదు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణ కోసం నాటిన ప్రతి మాకు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయుడు ప్రభాకర్ నాయుడు, కాశి నాయుడు, విద్యార్థులు గిరిజనులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

- ఎంపీడీవో త్రివిక్రమ్ రావు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : స్వర్ణాంధ్ర స్వచ్ దివస్‌లో భాగంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్ రావు పేర్కొన్నారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉప సర్పంచ్ కె ఎం రాజా, పంచాయతీ కార్యదర్శి తోన్నాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎం సుధాకర్ నాయుడు అధ్యక్షతన స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతి నెల 3 శనివారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలని వెల్లడించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడమే దీని లక్ష్యం అన్నారు ఇందులో ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేలా అధికారులు బాధ్యతన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం అందంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఫైల్ను ఫర్నిచర్ ను పద్ధతులు ఉంచుకోవడం ప్రజల రాకపోకలకు సాగించే ప్రాంతాలు అడ్డంకులు లేకుండా చేయడం వంటివి అందులో భాగమన్నారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివ్ స్ లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-అనే థీమ్ తో నిర్వహించారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో కాలుష్య వాతావరణం నియంత్రించుటకు ఉన్నత స్థాయి అధికారులు బాధ్యతని వెల్లడించారు ఈ కార్యక్రమంలో మొదటి మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్. రెవెన్యూ ఇన్స్పెక్టర్ మించల నల్లయ్య, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడి సూపర్వైజర్లు, సచివాలయం సిబ్బంది, విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని స్థానిక టవర్ క్లాక్ సెంటర్ లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్వర్ణాద్ర-స్వచ్చాంద్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ ను అమ్మకాలు చేయవద్దని వ్యాపారులకు సూచించారు.ఈనెల 20వ తేదీ వరకు వ్యాపారులకు అవకాశం ఇస్తున్నామని.ఆ తర్వాత ప్లాస్టిక్ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీ సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో నడుస్తుందని అన్నారు.ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు స్వచ్ఛందంగా ఆపివేయాలని అన్నారు.అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించి, పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,డిఎస్పి గీతా కుమారి,టీడీపీ నాయకులు శీలం కిరణ్ కుమార్,పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య,రహీం,వాటంబేడు శివకుమార్, మయూరి శ్యాం యాదవ్,వివిధ శాఖల అదికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి మేయర్ శ్రీమతి శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ ప్రత్యేక దర్శనం అన్నదాన సేవా కార్యక్రమం తిరుపతి నగరంలో విశేష భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్న శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల ఉత్సాహం మధ్య అద్భుతంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో తిరుపతి మేయర్ శిరీష దంపతులు ప్రత్యేకంగా హాజరై అమ్మ వారిని దర్శించుకొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మేయర్ దంపతులను ఆలయ అర్చకుల ఆశీర్వచనాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సర్వమంగళ ప్రాప్తి కోసం ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల నమ్మకానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఉత్సవాలు, సమాజం లో ఆధ్యాత్మిక శోభను చాటిచెప్పే అంశాలని ఆమె పేర్కొన్నారు.అన్నదాన మహోత్స వంలో మేయర్ ప్రత్యేక భాగస్వామ్యంధార్మిక సంప్రదాయాల్లో అన్నదానం పరమ ధర్మం అనే సూత్రాన్ని పాటిస్తూ, బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం విశేషంగా నిర్వహించబడింది. మేయర్ శ్రీమతి శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ గారు స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేసి, ఈ మహత్తర సేవలో భాగమయ్యారు. వేలాది మంది భక్తులు ఈ అన్నప్రసాదాలను స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రుల య్యారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా , ప్రత్యేక అభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో సంగీత-భజన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తుల నిస్వార్థ సేవా భావానికి, తిరుపతి నగరంలోని ఆధ్యాత్మికతకు ఇది మరో ఉదాహరణగా నిలిచింది.ఈ సంద ర్భంగా మేయర్ మాట్లాడుతూ, తిరుపతి భక్తి, మతసామరస్యానికి నిలయం అని, ఇలాంటి ఉత్సవాలు సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే మహోత్సవాలుగా అభి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు మరింత మద్దతునందించనున్నట్లు తెలిపారు.శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి కృపతో శాంతి, అభివృద్ధి, భక్తి మార్గంలో ముందుకు సాగుదామని శిరీష అన్నారు.

ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను నివారించండి

విశాలాంధ్ర - పుత్తూరు: వాడిన ప్లాస్టిక్‌ని మరో సారి వాడకుండా నివారించాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య అన్నారు. శనివారం కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి లక్ష్యమని, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, ఆహ్లాదవాతావరణం ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని వివరించారు. కళాశాల స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ సి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ప్రశాంతంగా చదువుకోవడానికి వీలుంటుందని అలాగే ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను మళ్లీ వాడకూడదని తెలిపారు. సభానంతరం కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబురావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ వరలక్ష్మి, నరసింహులు, జయప్రద, డాక్టర్ గంగయ్య, డాక్టర్ సామ్సన్ రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో స్వచ్ఛభారత్

విశాలాంధ్ర - కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మూడవ శనివారం స్వచ్ఛందర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో టీ.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డి నాగరత్నమ్మ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం చెత్త చెదారాలను కాల్చివేసిరు, అదేవిధంగా ఎంఈఓ కార్యాలయం, అని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ కార్యక్రమాలను చేపట్టారు. మూడోవ శనివారం ముక్కరవాణి పల్లె, కార్వేటి నగరం, డిఎం పురం,ఆల్లాతూరు గ్రామాలలో సర్పంచ్ గుణవతి లోకనాథం నాయుడు, ధనంజయ వర్మ, తులసి కుమారి సరళ కార్యదర్శిలు నగర తమ గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మొక్కలను నాటి వాటిని సంరక్షించండి

విశాలాంధ్ర - కార్వేటినగరం: ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని నగిరి డిఎస్పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం డిఎస్పి మాట్లాడు తూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలన్నారు. ఆ మొక్క పెద్దది మనకు ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తుం దన్నారు. మొక్క పెద్దదైన చోట మంచి వాతావరణంలో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఇంట ప్రతి కళాశాల పాఠశాలలో నాటలని పిలుపునిచ్చారు. నగిరి డిఎస్పీ వెంట ఎస్ఐ రాజకుమార్ ఏఎస్ఐ లో మునికృష్ణ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - పాకాల: చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని పేర్కొన్నారు. శనివారం పాకాల మండలంలోని దామల చెరువు గ్రామ పంచాయతీలో యన్.ఆర్.జి.యస్ నిధులతో ..సుమారు నాలుగు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, పాకాల ం దామలచెరువు తారు రోడ్డును చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావుతో కలసి పులివర్తి నాని ప్రారంభించారు. అనంతరం దామలచెరువు పంచాయతీలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో దామలచెరువు లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పాకాల మండలంలో ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మామిడి రైతులను దృష్టిలో ఉంచుకొని, మ్యాంగో బోర్డు ని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సహకారంతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పాకాల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమన్నారు. ఇంత త్వరగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో చంద్రగిరి ఎమ్మెల్యేని అభినందిస్తున్నట్లు తెలియజేశారు. అంతకు మునుపు పాకాల సమీపంలోని శ్రీ వల్లి దేవ సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే , ఎంపీ ఇరువురు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి పద్మజా రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయడు, సుబ్రమణ్య స్వామి దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు నాయకులు చలపతి ,కోటీశ్వరనాయుడు, చిన్నబ్బ నాయుడు, రఘునాథ నాయుడు, పురుషోత్తం , లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి పాతపేట ముకుంద వీధికి చెందిన నారిశెట్టి మహేష్ 28 సం.లు శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తిరుమల కొండమీద ఓ దుకాణం పెట్టుకుని వ్యాపారం నిర్వహిస్తూ ఇంటికి వారం పది రోజులకు ఒకసారి వచ్చేవాడు. ఈ నెల మూడో తేదీన వ్యాపారానికని మహేష్ తిరుమల కి వెళ్ళాడు. మహేష్ భార్య బండి కవిత తన పిన్ని ఉంటున్న వేలూరులో జరుగుతున్న జాతరకు తన భర్తతో చెప్పి వెళ్ళింది. శనివారం ఉదయం తన ఇంటికి వచ్చిన భర్త మహేష్ కు ఫోన్ చేసి ఎప్పుడు వస్తున్నారు అని అడగగా బయలుదేరినాము వస్తున్నామని తెలిపి పలుమార్లు తన భర్తకు ఫోన్ చేయటంతో ఆయన ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఆ వీధిలోని యువకుడికి ఫోన్ చేసి నా భర్త ఏమి చేస్తున్నాడో చూడాలని కోరింది. ఆ యువకుడు వారు కాపురం అంటున్న మిద్ది పైకి వెళ్లి చూడగా మహేష్ ఇంటిలోని ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించాడు. స్థానికులు మహేష్ ను కిందికి దించి చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళగా అప్పటికే మహేష్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మహేష్ భార్య కవిత ఆసుపత్రికి వెళ్లి తన భర్తను చూడగా అప్పటికే ఆయన చనిపోయి ఉన్నాడు. మృతునికి భార్య ఓ కుమారుడు ఉన్నాడు. అన్యోన్యంగా సంసారం సాగిస్తున్న ఆ కుటుంబానికి ఎలాంటి బాధలు లేకపోయినా ఎందుకు ఇలాంటి సంఘటన జరిగిందో కుటుంబ సభ్యులకు అర్థం కాలేదు. కుటుంబ ప్రధాన సంపాదనా పరుడు చనిపోవటంతో ఆ కుటుంబం వీధి పాలైంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బండి కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీక్షలో సొమ్మసిల్లిన మహిళ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామస్తులు ఇంటి పట్టాలు కోసం మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష జరుగుతోంది. నాలుగవ రోజు శనివారం జరిగిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో గ్రామానికి చెందిన కృష్ణవేణమ్మ సొమ్మ సిల్లి పడిపోవడంతో గ్రామ పెద్దలు రమణయ్య, సిపిఐ నాయకులు ధర్మయ్యలు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కొరకు తరలించారు. డాక్టర్ ఆమెకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో ఉన్న వ్యక్తులు ఆందోళనకు గురయ్యారు. ఇప్ప టికైనా రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామస్తుల కు న్యాయం చేయడానికి చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని అక్కడి వారు కోరారు.

పరిసరాల పరిశుభ్రతను పాటిద్దాం

విశాలాంధ్ర - పుత్తూరు: నారాయణ వనం మండల కొండల చెరువు గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డివిల్ పిఒ శ్రీకాళహస్తి ప్రభాకర్ రెడ్డి ఇఓఆర్‌డి వేణయ్య, కొండలచెరువు పంచాయతీ కార్యదర్శి మునివాసులు వీరా ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శనివారం ఉదయం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ పాల్గొని ఈ భాగంలో ప్రతి నివాసం వద్ద వెళ్లి తడి పొడి చెత్త వేరు చేయుట విధానంలో ఈ ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. తద్వారా ప్రకృతితో పాటు మానవాళికి ఎలాంటి ఇబ్బంది కలవకుండా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో గ్రామ సర్పంచ్ పళని పాటు ప్రజా ప్రతినిధులు గ్రామ కార్యదర్శు సచివాలయం సిబ్బందిలో గ్రామస్తులు విద్యార్థులు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతంగా చేశారు.

పలమనేరు ప్రింట్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - పలమనేరు: పలమనేరు ప్రింట్ మీడియా నూతన కమిటీ ని ఎన్నుకున్నారు .ఈమేరకు పట్టణానికి చెందిన ప్రింట్ మీడియా విలేకరులు శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అక్రిడేషన్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రింట్ మీడియా అసోసియేషన్ పలమనేరు నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షులుగా రఘునాథ రెడ్డి (ఆంధ్రజ్యోతి),అధ్యక్షులుగా పట్టణానికి చెందిన పి.శ్యామ్ కుమార్ (నేటి మనదేశం),ఉపాధ్యక్షులుగా ఆర్.రెడ్డప్ప (సంకర్షణ),ప్రధాన కార్యదర్శిగా ఎం. దిలీప్ కుమార్(వార్త), కోశాధికారిగా పి.సుబ్రహ్మణ్యం (విశాలాంధ్ర),లీగల్ అడ్వైజర్ రంజిత్ షా (ఆంధ్ర భూమి), కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం(సాక్షి), పి. మోహన్ (ఆంధ్రప్రభ), కె.అనిల్ కుమార్(సూర్య)లను ఎన్నుకొన్నట్లు సభ్యులు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిగా ఉంటూ నిజమైన జర్నలిజం విలువలను కాపాడుతూ నడుచుకొంటామని ఈమేరకు సభ్యులు వివరించారు.

కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా స్నాతకోత్సవం

విశాలాంధ్ర - కుప్పం: కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ నందు స్నాతకోత్సవం - 2024 ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో 300 మంది పైగా విద్యార్థులు తమ విద్యా జీవితంలో మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లిలిదా. ఢిల్లీబాబు విజయకుమార్, శాస్త్రవేత్త, డిఆర్‌డిఓ, భారత ప్రభుత్వ సంస్థ, బెంగళూరు, ప్రేరణాత్మక ప్రసంగాన్ని అందిస్తూ, విద్యార్థులను విశిష్టత సాధించేందుకు, తమ రంగాల్లో సానుకూల ప్రభావాన్ని చూపేందుకు ప్రోత్సహించారు. జీవితంలో ఈ డిగ్రీ పట్టా పొందడం ఒక గొప్ప మైలురాయిగా అభివర్ణించారు. ఈ రోజుని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలనీ కోరారు. ఆవిష్కరణ (ఇన్నోవేషన్), స్థిరత (సస్టైయినబిలిటీ) ఈ ప్రస్తుత యుగంలో విజయానికి మూల సూత్రాలు అని డా. ఢిల్లీబాబు విజయకుమార్ గారు అన్నారు. గొప్ప కలలు కనేందుకు వెనుకాడకండి అనే నినాదాన్ని అందిపుచ్చుకోవాలనీ పట్టభద్రులను కోరారు. సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగండి. చిన్న ఆలో చనలను పెద్ద ప్రభంజనాలుగా మార్చే అవకాశం ఇప్పుడు మీ ముందుంది అని అన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో విప్లవాత్మక మార్పులకు సమయం సిద్ధంగా ఉంది. మీ ప్రత్యేకమైన దృక్పథాలు, నైపుణ్యాలు నిజమైన ప్రభావం చూపగలరనీ కోరారు. ఈ వేడుకలో సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్ బి.సి. నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా. ఎన్. సునీల్ రాజ్, సెక్రటరీ ఎన్. సాగర్ రాజ్ , ప్రిన్సిపాల్ డా.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.భాస్కరన్, విభాగ అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై విశ్వనాథ నాయుడు శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమలో భాగంగా పోలీస్‌స్టేషన్ పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో వ్యర్థాలు, ప్లాస్టిక్ నియంత్రణ, చెత్త చెదారం తొలగించి కార్యాల యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపు నివ్వడంతో నేను నా స్టేషన్ సిబ్బంది పారిశుద్ధ్యం పనులు చేపట్టామన్నారు, పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న వ్యర్థాలను ప్లాస్టిక్ సామాగ్రి వాటర్ బాటిల్ చెత్త కాగితాలు తొలగించడం జరిగింది. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాల గురవ య్య, నమో రంగ, సురేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- కార్మికులపై తెస్తున్న రాజకీయ ఒత్తిడిలను ఆపాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్

విశాలాంధ్ర - పుత్తూరు: నగరి, చిత్తూరు పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో వంట చేయు కార్మికుల విస్తృత సమావేశం యూనియన్ అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథుగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు, చిత్తూరు పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేయు మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు సుమారు ఇరవై సంవత్సరాలుగా మహిళా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి సరైన జీతాలు లేకపోయినా వంట చేసి పిల్లలకు పెడుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్న ప్రతి సారి కార్మికులను మార్చాలి అనుకోవడం, స్థానిక చోట మోట నాయకులు రోజూరోజుకు కొన్ని సెంటర్లలో కార్మికులను మార్చాలి అనుకోవడం తప్పని అన్నారు. కార్మికుల పై రాజకీయ ఒత్తిళ్లు నుంచి కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యం లో ,రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేపడతామని అన్నారు. అధికారం లో వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో వంట చేయు కార్మికులను జీతాలు పెంచుతాము, అని చెప్పి పది నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలను నిత్యవసర ధరలు పెరుగుతున్న కొద్ది, పిల్లలకి ఇచ్చే మెస్ డబ్బులు 30 రూపాయలకు పెంచి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము. గత ప్రభుత్వం ఉద్యోగ కార్మికులకు అన్యాయం చేసినందువలన ఈరోజు అందరూ కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మహిళా కార్మికులపై పని నుంచి నిలిపివేస్తామని ఒత్తిడి తీసుకొస్తూ బలవంతంగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ పెట్టి తీసేస్తామని బెదిరించడాన్ని మానుకోవాలి. ఈరోజు ఉద్యోగ కార్మికులు ప్రజలందరూ పెద్ద ఎత్తున తెలుగుదేశం ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం వలన అధికారం చేపట్టడం జరిగింది. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వమే ఉచిత సిలిండర్ ఇప్పించాలని వంట సామాగ్రిలను ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్ క్రింద ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ,ప్రతి నెల 7000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈరోజు జిల్లాలో ఉన్నటువంటి మధ్యాహ్న భోజన కార్మికులకు , ప్రభుత్వ పాఠశాలలో పనిచేయ ఆయామ్ములులకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని ఆదుకునే విధంగా స్థానిక అధికారులకు సూచనలు ఇవ్వాలని కోరారు. అధికారులు ఒత్తిళ్లకు లొంగకుండా కార్మికులను కొనసాగించాలని ఏఐటియుసి కోరుతున్నది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు, ఐఐటిసి పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, ఏఐటిసి నాయకులు మని, లత ఆంధ్రప్రదేశ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం కార్మికుల యూనియన్ నాయకులు రాజేశ్వరి ,రాణి, సెల్వి, సుశీల, సుమ, మహాలక్ష్మి ,ఢిల్లీ భాయ్, సరస్వతి ,ఆ.ప్ర. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - పుత్తూరు: మార్చి 15వ తేదీని ఐక్యరాజ్యసమితి ప్రపంచ వినియోగదారుల దినోత్సవంగా ప్రకటించింది. కాబట్టి ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదీని ప్రపంచ వినియోగదారుల దినోత్సవం గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో కళాశాల కన్స్యూమర్ క్లబ్, వాణిజ్య శాస్త్ర విభాగం ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించినటువంటి వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యక్షురాలు డాక్టర్ ఏ. దేవకి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి వినియోగదారుడేనని, ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించిన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కలిగి ఉంటేనే తమకు ఎదురయ్యే దోపిడీని నిరోధించగలుగుతామని డాక్టర్ ఏ.దేవకి అన్నారు. కళాశాల కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వి.వాసవి మాట్లాడుతూ ఈ సం వత్సరం సుస్థిర జీవనశైలికి ఒక న్యాయమైన పరివర్తనలి అనే నినాదాన్ని ఐక్యరాజ్యసమితి ఇచ్చిందని, దీన్ని అందరికీ తెలియజేయాలని కోరారు. వినియోగదారులకు వస్తు సేవల నాణ్యత, సరసమైన ధరలకు వస్తువులు అందుబాటులో ఉండడం మొదలైనటువంటి అంశాల పట్ల వినియోగదారులు అవగాహన కలిగి ఉం డాలని, వినియోగదారులకు నష్టం కలిగితే న్యాయపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వినియోగదారులకు ప్రత్యేకంగా సంఘాలు, న్యాయస్థానాలు ఉన్నాయని డాక్టర్ వి.వాసవి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వాసవి, డాక్టర్ జి.తిరు మలయ్య, డాక్టర్ జి.గంగయ్య,డాక్టర్ మురళీ మోహన్ రెడ్డి, జ్యోతి, లక్ష్మీభాయి, నాగరాజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉబర్ క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో పనిచేసే ఉబర్ క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తిరుచానూరు పంచాయతీ చైతన్యపురం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉబర్ యాప్‌లకు నగరంలో సుమారు 2 వేల మంది డ్రైవర్లు లింకయ్యారని,ఉబెర్ యాజమాన్యం వీరిని గత ఏడు సంవత్సరాలుగా అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతోందని వెల్లడించారు. ఉబెర్ యాజమాన్యంకు సంబంధించిన ప్రతినిధులు తిరుపతిలో ఎవరూ ఉండటం లేదని, డ్రైవర్లకు సమస్య వస్తే ఎవరితో చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఉబర్ వంటి ఆన్ లైన్ బిజినెస్‌లో తెల్లబోర్డుతో నడిచే సొంత వాహనాలు నడపరాదన్నారు. తిరుపతిలో వెంటనే వెహికల్ ఆడిటింగ్ చేయాలని,ఉబెర్ సంస్థ పేరు చెప్పుకుని ఫేక్ ఐడీలతో చాలా వాహనాలు తిరుగుతూ వున్నాయన్నారు. రేణిగుంట ఎయిర్ పోర్ట్ లోకి వెళ్లే సమయంలో తలెత్తే సమస్యలను పరిష్కరించాలని,ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలను లోకల్ బుకింగ్ చేయరాదన్నారు. ఏపీలో ఎక్కడా వోలా, ఉబర్ సంస్థలకు చెందిన బ్రాంచి కార్యాలయాలు లేవన్నారు. గత 10 సంవత్సరాలు క్రితం వున్న ట్యాక్సీ చార్జీలు ఇంకా కొనసాగిస్తున్నారని, గతంలో డీజిల్ ధరలు రూ. 64లు వుంటే ఇప్పుడు రూ.100లకు పెరిగినా కూడా డ్రైవర్లకు ఇచ్చే కమీషన్లు మాత్రం పెంచలేదని, సంస్థకు చేరాల్సిన కమీషన్‌ను మాత్రం తగ్గించలేదన్నారు.అలాగే ట్యాక్సీ చార్జీలు కూడా పెంచడం లేదని, అలా చేయడం వల్ల వాహనాలు నడపడం చాలా కష్టంగా మారిందన్నారు.ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ లు చొరవ తీసుకుని ఉబెర్, ఓలా సంస్థల ద్వారా నష్టపోతున్న తిరుపతి క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిబాబు, ఖాదర్ భాషా, రమేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఎల్లయ్య, భానుప్రకాష్, దొరబాబు, మురళి, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర - దొరవారిసత్రం: మండల పరిధిలోని ఏకొల్లు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీల్ గంజాయిని తీసుకోని వెళ్తున్న ఇద్దరిని నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ పట్టుకున్నారు. పోలీసులు వివరాలు ఒరిస్సా నుంచి కుప్పంకు లారీలో ఇద్దురు వ్యక్తులు గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా మాటు వేసి వారిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న వారి వద్ద 5 కేజిల గంజాయి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారు చిత్తూరు జిల్లాలోని కుప్పం మండలంలోని కంగుడి గ్రామానికి చెందిన రవిడి మురుగేష్, కట్టు మణిలు వీరిని శనివారం సూళ్లురుపేట కోర్టుకు హాజరులో హాజరు పరిచారు. వీరికి 14 రోజులు రిమాండ్ ను విధించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - తడ: మండల పరిధిలోని రామాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తడ ఎస్సై కొండప నాయుడు సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తిరువల్లూరు జిల్లా ఆరంభం గ్రామానికి చెందిన రవి 57సంవత్సరాలు శుక్రవారం రాత్రి రామాపురం గ్రామంలో పని నిమిత్తం వెళ్లి జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా జగన్ సిమెంట్ షాపు వద్ద చెన్నై మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు దీంతో స్థానికులు గాయపడ్డ రవిని సమీపంలోని ఏళావూరు వద్దనున్న వైద్యశాలకు తరలించగా అప్పటికే రవి మృతి చెందాడని మృతుని కుమారుడు అజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు నిర్దిష్ట లక్ష్యం ఉండాలి

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - పాకాల: విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాని ప్రకారం ముందుకు వెళ్లాలని చెందిన శాసనసభ్యులు పులివర్తి నాని పేర్కొన్నారు. శనివారం పాకాల మండల సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, పుతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పులివర్తి నాని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చునని విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధత కలిగి ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. అకడమిక్ టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా క్యాష్ ప్రైజ్‌లను అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సాయి శిరీష, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు తీసుకురావాలి

విశాలాంధ్ర - సత్యవేడు: స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానిక ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి చెప్పారు.శనివారం మండల పరిషత్, వెలుగు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి గృహిణిపై ఉందన్నారు.ప్రతిరోజు పోగవుతున్న చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టలు వేసి పారిశుద్ధ కార్మికులకు అప్పగించాలన్నారు.ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం తీసుకొచ్చి పచ్చదనాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగానే అన్ని పంచాయతీల్లోనూ మూడవ శనివారం తప్పనిసరిగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇతర దేశాలకు వెళ్లినప్పుడు చెత్త కుండీలో తప్ప మరి ఎక్కడ చెత్త వేసే పరిస్థితి ఉండదన్నారు.అయితే ఇక్కడ మాత్రం ఇష్టానుసారంగా వ్యవహా రిస్తూ చెత్తను పడేస్తామన్నారు. ఇదేకాక ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించా లన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాస్టిక్ సంచులను, గ్లాసులను వినియోగించడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. అంతకుముందు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు.ప్రతిజ్ఞ చేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మస్తాన మ్మ, ఎంపీటీసీలు బాలయ్య, సరవన, సెల్వి, ఇంద్రాణి, సర్పంచులు రవిరెడ్డి, మధురాజు, గోవింద్ స్వామి, శేఖర్, శివరంజని, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఈవోఆర్డి తరుణాక్ష రెడ్డి, వెలుగు ఏపీఎం డాక్టర్ దాంగే యాదవ్, సిసి శివకుమార్, పుల్లయ్య, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలి: చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర - పాకాల: పాకాల మండలంలోని వైసీపీ నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. పాకాల మండల వైసిపి నాయకులతో శనివారం మోహిత్ రెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాకాల మండల పార్టీ అధ్యక్షులుగా నియమితులైన అనంగా నరేష్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ ఆయన ఆరోగ్యం కలిసి పని చేయాలన్నారు.రాజకీయాల్లో కలసికట్టుగా పనిచేస్తే అద్భుత విజయాలను సొంతం చేసుకోవచ్చున్నారు.గత ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేశారనీ అయితే ప్రజలు మార్పు కోరుకోవడం వల్ల అధికారం పోయిందని చెప్పారు. మళ్లీ అధికారంలోకి వచ్చేంత వరకు నాయకులందరూ ఐకమత్యంగా ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. పార్టీలో నాయకుల మధ్యన ఏదైనా చిన్న, చిన్న విభేదాలు వుంటే కూర్చుని పరిష్కరించుకుందామన్నారు.ప్రతిపక్షం పార్టీకి కొత్త ఏమీ కాదనీ వైసిపి పోరాటాలతో పుట్టిన పార్టీ అని పోరాడటంలో జగనన్నను మించిన వారు ఎవ్వరు లేరన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రజల పక్షాన కలసి మెలసి పోరాడి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. తాను మీ కుటుంబం సభ్యునిగా ఎవ్వరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

విశాలాంధ్ర - గూడూ రు: గూడూరు రూరల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఓ బాలిక ఏడుస్తూ ఉండడంతో గమనించిన స్థానికులు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌కి సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పాప దగ్గరికి చేరుకొని వివరాలు అరా తీశారు . నా పేరు గాయత్రి నేను 6 క్లాస్ మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్నానని చెప్పింది. మిగతా వివరాలు చెప్పలేదు. దీనితో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ స్థానికుల సహకారంతో పాప వివరాలు అరా తీసి దిగువ వీరారెడ్డిపల్లి హరిజనవాడ లో ఉన్న వారి బాబాయి వద్దకు చేర్చడం జరిగింది. సకాలంలో పాపని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన ఎస్సై మనోజ్ కుమార్, సిబ్బంది నీ స్థానికులు అభినందించారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - పాకాల: స్థానిక పట్టణంలోని స్కై లైన్ ఆక్స్ ఫర్డ్ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాలకూరు నాగేంద్ర తెలిపారు. శ్రీ సాయి డెంటల్ , ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, మనూష్ న్యూట్రిషన్ సెంటర్ వారి వైద్య బృందంతో ఉదయం 10గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం జరుగుతుందని ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ ఈసీజీ , కంటి సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

సంగం పాల డెయిరీ ప్రారంభం

విశాలాంధ్ర - రామకుప్పం: మండల పరిధి లోని బందార్లపల్లి పంచాయతీ లో పాడి రైతులకు అందుబాటులో సంఘం పాల డైరీని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, సంఘం డైరీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు శనివారం పూజా కార్యక్రమం అనంతరం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో పాల ఉత్పత్తి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం విరివిగా పాల ఆవులు కొనుగోలుకు బ్యాంకులు రుణా లు అందిస్తుందని దీంతో పాడి పరిశ్రమ అభి వృద్ధికి ప్రత్యేకంగా పాడి పశువుల రైతులు ఆర్థి కంగా అభివృద్ధి చెందాలని కోరారు కార్యక్ర మంలో మోహన్ రావు, కోటేశ్వరరావు, వెం కటేష్, నియాజ్ అహ్మద్, శ్రీనాథ్ రెడ్డి, బాలు, సుబ్రి, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో పార్కు అభివృద్ధికి సహకరించండి

- తుడా కమిషనర్ మౌర్యకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడులో తుడా నిధులతో ఏర్పాటు చేస్తున్న ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం తుడా కమిషనర్ మౌర్యను కోరారు.నియోజకవర్గ పరిధి లో తుడా నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం తుడా కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి పరిశీలించారు. ఈ క్రమంలో సత్యవేడులో తుడా నిధులతో చేపడుతున్న పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పార్కులో ప్రజలు కూర్చొనేందుకు రాతి బల్లలు మాత్రమే ఏర్పాటు చేసి ఉన్నారని, వాకింగ్ ట్రాక్,పిల్లలు ఆడుకునేందుకు ఉపకరణాలు, పచ్చదనం కోసం చెట్ల పెంపకం తదితర పనులు చేపట్టాల్సి ఉందని ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి మండల ప్రజలకు పార్కును అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ పార్కు పనులు వెంటనే ప్రారంభించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పరమశివం, కోళ్ల చిన్న, ధనశేఖర్, వెంకటరమణ, జనసేన నాయకుడు బాలమురలి తదితరులు పాల్గొన్నారు.

సాంబశివను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: మండలంలోని అవిలాల పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు సాంబశివ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం అవిలాల పంచాయతీలోని సాంబశివ స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన నగరి డీఎస్పీ

విశాలాంధ్ర - కార్వేటినగరం: కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వద్ద నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పర్యటనలో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. ప్రతి ఒక్కరు చిన్న పెద్ద తేడా లేకుండా ఎండాకాలం తాగునీరు ఎక్కువగా తాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలి కేంద్రంలో మజ్జిగ అందరికీ పంపిణీ చేశారు. ఇదే విధంగా అవసరమైన చోట్ల చలివేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎండలో చిన్న పిల్లలు ముసలివారు తిరగకూడదని పిలుపునిచ్చారు. ఎందుకు ప్రజలు సహకారం అందించా లన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ హనుమంతప్ప ఎస్ఐ రాజకుమార్ ఏఎస్ఐలు మునికృష్ణ పోలీస్ సిబ్బంది టిడిపి నాయకులు రవి యాదవ్ వాసుదేవ రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రావలసిన ఆదాయ పన్ను తక్షణమే వసులు చేయాలి

- సిపిఐ నాయకుల వినతి

విశాలాంధ్ర - పుత్తూరు: సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ సమితి ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపల్ కమిషనర్ సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ మున్సిపాలిటీకి 2021 నుండి 24 వరకు ఏడాది పాటు లీజు ప్రతి పాదన బకాయిలను వసూలు చేయాలని వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా డి మహేష్ మాట్లాడుతూ గతంలో 2021 నుండి 24 వరకు సంఘం ఏడాది పాటు లీజు ప్రతి పతికిన దినసరి మార్కెట్ జంతువుల ప్రైవేటు బస్టాండ్ బకాయిలు దాదాపు 40 లక్షల పదివేల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వసూలు చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహత పడాలని కోరారు సామాన్యమైన ప్రజల దగ్గర నుండి రోజువారి వ్యాపారస్తుల దగ్గర ముక్కు పుండి వసూలు చేసిన కాంట్రాక్టర్లు మున్సిపాలిటీ మాత్రం కట్టలేదని మునిసిపల్ అధికారులు సమయమైన జనాలు దగ్గర నుండి ఇంటి పన్ను కొళాయి పన్ను కట్టలేదంటే కొళాయి కట్ చేస్తాం కరెంట్ కట్ చేస్తామని బెదిరించి మరి వసూలు చేస్తారని బడా కాంట్రాక్టు దగ్గర నుండి మాత్రం వసూలు చేయడంలో చేతులెత్తేస్తున్నారని తెలిపారు ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు పెండింగ్లో ఉన్న బకాయిలను వసూలు చేయాలని గెజిట్ లోబడే వసూలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు రవి ,మనీ, రమణ, మహేష్ ,బి.ఎస్.పి పార్టీ నాయకులు ధనుంజయ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యార్థులు శుక్రవారం కళాశాలలో సాంకేతిక పరిజ్ఞాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కోరెస్పాండెంట్ రవీంద్ర బాబు మాట్లాతూ విద్యార్థులు విద్యార్థి దశనుండి సాంకేతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అనతరం విద్యార్థులు తయారు చేసిన సాంకేతి క పరికరాలు పరిశీలించారు. పలువురు విద్యార్థులను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సలహాదారు రాజేంద్ర రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైయస్సార్సీపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా అన్నాదొరై

విశాలాంధ్ర - పుత్తూరు: నారాయణ వనం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకే మాజీ మంత్రివర్యులు పెద్ద రెడ్డి రామచంద్ర రెడ్డి జిల్లా ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి తిరుపతి పార్లమెంటు ఎంపీ గురుమూర్తి ఉమ్మడి జిల్లా క్రియ శీల టి రాకేష్ కిరణ్ ఈ పదవి రావడానికి మీరు కృషి చేసినందుకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వైయస్సార్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పార్టీ కుటుంబ సభ్యులకు తన వంతు రాత్రింబవలో పార్టీ కోసం కృషి చేస్తానని పార్టీ అభివృద్ధి కోసం ఎల్లవేళ అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో కు తన వంతు పని చేస్తానని సత్యవేడు నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు వైఎస్ఆర్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూను.

గాలి కుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర - గుడిపాల: పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి వ్యాప్తి చెంద కుండా వేసే టీకా మండల స్థాయిలో వేయడం జరుగుతుంది, అందరూ తమ తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించాలి కేంద్ర ప్రభుత్వ సహాయంతో గాలి కుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని గుడిపాల మండలంలో శనివారం బట్టువల్లపూరు, ముతువల్లపూరు లొ వ్యాక్సిన్ ను ఆవులకు వేశారు. ఎట్టి పరిస్థితుల లోనూ పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని అదేవిధంగా మార్చి ఏప్రిల్ నెలలో వచ్చి తీవ్రం అయ్యే గాలికుంటు వ్యాధి వల్ల ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని అటువంటి ప్రమాదం రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని ఈ ఏడాది కూడా అదే విధంగా రావడం జరిగిందని అన్నారు. అందరూ పాడి రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గుడిపాల లైవ్‌స్టాక్ అదికారి డి.హాషీమ్ అన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

విశాలాంధ్ర - పుత్తూరు: నారాయణ వనం మండల నారాయణ వనం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇంచార్జ్ ఎంపీడీవో గుణశేఖర్ తాసిల్దార్ జయరాములు వీరి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత కార్యక్రమం పైన అవగాహన ర్యాలీ నారాయణవనం ఈవో కార్యదర్శి టిపి షణ్ముగం వీరా ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మూడవ శనివారం ఉదయం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ పాల్గొని ఈ భాగంలో ప్రతి నివాసం వద్ద వెళ్లి తడి పొడి చెత్త వేరు చేయుట విధానంలో ఈ ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క చోట పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకొని విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు తద్వారా ప్రకృతితో పాటు మానవాళికి ఎలాంటి ఇబ్బంది కలవకుండా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో అధికారులతో మేజర్ పంచాయతీ గ్రామ సర్పంచ్ శారదమ్మ దొరై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎన్ భాస్కరన్ బోస్ మండల ఏపీఎం మమత ద్వాక్రా మహిళలు పాటు ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శి సచివాలయం సిబ్బందిలో గ్రామస్తులు విద్యార్థులు యువకులు స్వచ్ఛందంగా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పీఎం థామస్

విశాలాంధ్ర - పెనుమూరు: మండలంలోని పెనుమూరులో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు శనివారం ఉదయం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ఇందులో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించి ప్రజా సమస్యల పరిష్కార ధ్యాయమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజా సమస్యలే ప్రభుత్వ ధ్యేయంగా భావించి ప్రతి నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలందరూ ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను స్వీకరించి వీలైనంతవరకు సమస్యలను సంబంధిత అధికారుల చేత పరిష్కారం చేసేంతవరకు చూసుకోవాలని తెలియజేయడం జరిగిందన్నారు. కావున ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రవణ్ కుమార్ ప్రజలు రాజకీయ నాయకులు అధికారులు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి కోన శశిధర్‌ని కలసిన చంద్రగిరి ఎమ్మెల్యే

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, తిరుపతి జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్ ని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిపై ఇరువురు కలిసి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అవిలాల పంచాయతీలో పరిశుభ్రతే ప్రథమ లక్ష్యం

ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పరిధిలోని అవిలాల పంచాయతీలో స్వచ్ఛ అవిలాల - స్వర్ణ అవిలాల కార్యక్రమాన్ని శనివారం నిర్వ హించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అవి లాల గ్రామపంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యేకి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అవిలాల గ్రామ సచివాలయం నుండి శ్రీ చక్ర గార్డెన్ వరకు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని పిల్లల చేత ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం"స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని పంచా యతీలలో, గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు తదితర విభాగాలలో అంకిత భావంతో పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించాలని కోరారు. దానిలో భాగంగా అవిలాల పంచాయతీలో "స్వచ్ఛ అవిలాల- స్వర్ణ అవిలాల"లో తడి చెత్త - పొడి చెత్త పై ప్రజలకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తూ,ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని చెత్తను తడి చెత్త, పొడి చెత్త ను వేరు చేసి వారి ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించా లని, అందుకొరకు గతంలోనే బుట్ట లను ప్రభు త్వం అందించిందని గుర్తు చేశారు. ప్లాస్టిక్ నివారణ చర్యలు భాగంగా పంచా యతీలో ప్రతి ఇంటికి ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ బ్యాగులు వాడే విధంగా జాగ్రత్తలు పాటించాల ని కోరారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే అవి మట్టిలో కలిసిపోవని, అలాగే సంవత్సరాల తరబడి భూమి పొరల్లో ఉండిపోతాయని, తద్వా రా పర్యావరణం దెబ్బ తింటుందని అన్నారు.ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో కుండా ఉంటే చెత్త పేరుకుపోయి దోమలు ఈగలు పెరుగుతాయని, దోమల వల్ల మలేరియా డెంగ్యూ లాంటి పలు విష జ్వరాలు, టైఫా యిడ్ కలరా వంటి రోగాలు ప్రబలుతాయని ఎమ్మెల్యే తెలిపారు.ప్లాస్టిక్ నివారణలో భాగంగా అవిలాల పంచాయతీలో ప్రతి ఇంటికి ఉచి తంగా చెత్త సేకరణకు అవిలాల పంచాయతీలో గుడ్డ బ్యాగ్గులు ప్రభుత్వం పంపిణీ చేసింది.అనంతరం శ్రీ చక్ర గార్డెన్ లో చెత్త నుండి ఎరువు తయారు చేసిన స్టాల్ ను ఆయన పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర"కార్యక్రమం పై అవిలాల పంచాయతీ ప్రజల చేత పులివర్తి నాని ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో డీపీఒ సుశీలాదేవి, ఎంపీడీఒ కె.రామచంద్ర, సర్పంచ్ చెందిలి వెంకటరమణ, టీడీపీ నాయకులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తర్వాతే ట్రాక్టర్లు రోడ్డుపైకి రావాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: రిజిస్ట్రేషన్ తర్వాతే కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు రోడ్లపైకి రావాలని శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడు ఆదే శించారు. శ్రీకాళహస్తి ఎంవీఐ కార్యా లయంలో శనివారం ఆయన పట్టణ ట్రాక్టర్ డీలర్లతో సమావేశమయ్యారు. డీలర్లు ట్రాక్ట ర్లను డెలివరీ చేసేటప్పుడు ఖచ్చితంగా వాహన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అ లాగే వాహన నంబర్ ప్లేట్లు తొందరగా వాహనానికి బిగించే ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్రీకా ళహస్తి ప్రాంతంలో చాలా ట్రాక్టర్లు నంబర్లు లేకుండా తిరుగుతున్నట్లు గమనించామని... ఇకపై అలాంటి తప్పిదాలు దొర్లితే ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ట్రాక్టర్లకు సరైన రిజిస్ట్రేషన్ లేకుంటే ప్రమాదం జరిగినా, మరణించినా ఇన్సూరెన్స్ వర్తిం చదని తెలిపారు. ప్రతి ఒక్క ట్రాక్టర్ యజమాని వాహనమునకు నంబరు ప్లేట్ అమర్చుకోవాలని తెలిపారు. గత సంవత్సరం జరిగిన ఒక ట్రాక్టర్ ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోవడం జరి గిందని... ఆ ట్రాక్టర్ ను సరైన రిజిస్ట్రేషన్ లేకుండా డెలివరీ చేసినందుకు ఆ డీలరుకు లక్ష రూపా యలు అపరాధ విధించడం జరిగిందన్నారు. డీలర్లు అందరూ రవాణా శాఖ వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను అమ్మాలని తెలియజేశారు. ట్రాక్టర్ యజమా నులు తప్పనిసరిగా అన్ని రికార్డులను, లైసెన్స్ లను కలిగి ఉండాలని సూచించారు. వ్యవసాయా నికి వాడే ట్రాక్టర్లను వాణిజ్యపరంగా వాడరాదన్నారు. వాణిజ్యపరంగా వాడే ట్రాక్టర్లకు సకాలంలో టాక్స్ లు చెల్లించాలనీ, తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

డ్రైవర్స్ కాలనీలో వైసీపీ కార్యకర్తలపై దాడి

- ఖండించిన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

విశాలాంధ్ర - పలమనేరు: నియోజకవ ర్గంలోని గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్సీపీ నాయకుడు బాబు, అతని భార్య వార్డు కౌన్సిలర్ విజయ కుమారుడు దిలీప్ లపై టిడిపి నాయకులు దాడి చేయడం కరెక్ట్ కాదని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి లో టిడిపి దాడి సంఘటనలో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్తలను తమ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అదే కాలనీకి చెందిన పచ్చ కూటమి రౌడీలు రవి,శివ మరికొంతమంది కలిసి వేట కొడవళ్లతో, కట్టెలు, రాడ్లు లతో దాడి చేసి, లారీ క్రిందకు తోసేస్తాము అని ఈడ్చుకువెళ్లి తీవ్రంగా గాయపరిచటం జరిగిందన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఆమె దుస్తులు చింపి, గొంతుపిసికి క్రూరంగా ప్రవర్తించి ఆమె చేయి విరిచి హింసించడం జరిగిందన్నారు.వైయస్ఆర్ సీపీ నాయకుల మీద కక్ష సాధింపులు కొనసాగుతున్నాయని టిడిపి నాయకులు మీ గవర్నమెంట్ వచ్చిందని రెచ్చిపోయి దాడులకు దిగడం సరికాదన్నారు. స్వాతంత్రాన్ని మరియు భారత రాజ్యాంగాన్ని ఈ కూటమి ప్రభుత్వం పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ఇవాళ వైసీపీ నాయకుల పై దాడులు చేస్తున్నా పోలీసులు మాత్రం ఏమీ తెలియదు అన్నట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వానికి అధికార దాహం తీరిందని ఇక రక్తదాహానికి పాల్పడు తున్నారని ఎద్దేవా చేశారు. దాడులు ఇలాగే కొనసాగితే మాత్రం సహించే ప్రసక్తే లేదని పోలీసు లు శాంతిభద్రతలకు కాపాడకుంటే చర్యకు ప్రతి చర్య కచ్చితంగా ఉంటుందని అధికారంలోకి వ చ్చిన తర్వాత కచ్చితంగా ప్రతి ఒక్కరికి వడ్డీ తో సహా చెల్లిస్తామని హెచ్చరించారు . అధికార పార్టీ కి వత్తాసు పలుకుతున్న అధికారులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీతో చరవాణి ద్వారా మాట్లాడి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఎవరు అధైర్య పరవద్దని యే కష్టం వచ్చినా నాతోపాటు వైసిపి కుటుంబం సభ్యులందరూ అండగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు హేమంత్ కుమార్ రెడ్డి ప్రహ్లాద బాగా రెడ్డి, చంద్రప్ప భాస్కర్ రెడ్డి వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో పలువురికి నియోజకవర్గ పదవులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వైసీపీలో పలువురికి నియోజకవర్గ స్థాయి పదవులు లభించాయి. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వైసీపీకి చెందిన 25 మందికి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియామక పత్రాలు పంపారు. పదవులు పొందిన వారిలో సూరా సురేష్(యువత విభాగం), టీ. పర్వీన్ (మహిళా విభాగం), (శ్రీరాములు రెడ్డి(రైతు విభాగం), శివయ్య(బీసీ సెల్), పసల క్రిష్ణయ్య(ఎస్సీ సెల్), గెరటా వెంకటాద్రి(ఎస్టీ సెల్),పఠాన్ ఫరీద్ (మైనార్టీ సెల్), పి.కార్తీక్(విద్యార్థి విభాగం), ఆశా కిరణ్(మున్సిపల్ విభాగం), లక్ష్మీపతి రెడ్డి(న్యాయ విభాగం), జగన్నాథ్ రెడ్డి(వైఎస్సార్ టీయూసీ), పి భరత్ కుమార్ రెడ్డి(ఐటీ విభాగం), ఎం అల్లెయ్య (చేనేత విభాగం), అయోధ్య (గ్రీవెన్స్ సెల్ విభాగం), పి బాలసుబ్రమణ్యం రెడ్డి(పంచాయతీరాజ్ విభాగం), రంగినేని చెంచయ్య నాయుడు (వాలంటీర్ విభాగం), టి మోహన్(దివ్యాంగుల విభాగం), టి రామ్మూర్తి (సాంస్కృతిక విభాగం), టీఎం భాస్కర్(వాణిజ్య విభాగం), బి బాలాజీ(ఆర్టీఐ విభాగం), ఎస్ డేవిడ్(క్రిస్టియన్ విభాగం), ఎం శంకరయ్య(డాక్టర్స్ విభాగం), సి జయకృష్ణ(సోషల్ మీడియా విభాగం), జి బత్తి శెట్టి(బూత్ కన్వీనర్ల విభాగం), బి దిలీప్(ప్రచార విభాగం) ఉన్నారు. వీరికి ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పాల రైతుల కష్టం.. దోపిడీ

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: పాడి రైతుల కష్టం దోపిడీకి గురు అవుతున్నది. రైతులను దళారులు అన్ని విధాలుగా మోసం చేస్తున్నారు.అహర్నిశలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక, చేసిన అప్పులు తీర్చలేక,సిగ్గుతో ఊరు వదిలి వలస వెళ్లే రైతులు కొందరైతే,ఊరు వదిలి బ్రతకలేక ఉన్న ఊరిలోనూ బ్రతకలేక ఆత్మహత్యలు చేసుకునే రైతులు కొంతమంది ఈ క్రమంలోనే పాడి పశువులను మేపే పాల రైతు పాలను పిండి దళాలీల ద్వారా డైరీలకు వేస్తే అదే డైరీలవారు వారికిచ్చే ధరలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది ఒక లీటరు 28 రూపాయల నుంచి 31 రూపాయల వరకు మాత్రమే ఇస్తున్నారంటే ఇది రైతులను దోపిడీ చేయడమే కదా? అక్కడితో అయిపోలేదు లీటరు 28 రూపాయలు ఇవ్వాలంటే ఫ్యాట్ శాతం ఎక్కువ ఉండాలి,ఎస్ ఎన్ ఎఫ్ రావాలి,నీటి శాతం తక్కువ ఉండాలి, ఒక రైతు నాలుగు పాడి ఆవులను పెంచడానికి అతనికి అయ్యే ఖర్చు ఎంత? వాటికి అనారోగ్యం వేస్తే రైతు చేసే ఖర్చు ఎంత? అవి అకస్మాత్తుగా చనిపోతే అతనికి వచ్చే నష్టం ఎంత? వీటన్నింటినీ ఓర్చుకొని స్వచ్ఛమైన పాలను డైరీలకు దళా లీల ద్వారా డైరీలకు అందిస్తే లీటరుకు 28 రూపాయలు ఇచ్చి అందులోని వెన్నెను తీసుకొని పోషక విలువలు పక్కన పెట్టి ఆ పాలను పాల ప్యాకెట్ల ద్వారా ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఈ దోపిడీని ప్రశ్నించే నాధుడే కాన రావట్లేదని రైతులు తమ గోడును వెళ్లకక్కుతున్నారు. పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందే విధంగా, గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా సంబంధిత శాఖ వారు, రైతు సంఘాల వారు చూడాలని పాడి రైతులు తెలియజేస్తున్నారు.

సర్పంచ్‌లకు తెలియకుండా రికార్డులను పరిశీలించే అధికారం ఈవోపీఆర్డీకి లేదు

- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ మధురాజు

విశాలాంధ్ర - సత్యవేడు: గ్రామ సర్పంచులకు తెలియకుండా పంచాయతీ రికార్డులను పరిశీలించే అధికారం పంచాయతీరాజ్ విస్తరణాధికారికి లేదని సత్యవేడు మండలం రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు.ఈ నేపథ్యంలో గ్రామ పరిపాలన వ్యవహారాల్లో పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై పలువురు సర్పంచులు ధ్వజమెత్తారు.ఈ క్రమంలో సర్పంచ్ మధురాజు ఈవోపీఆర్డిపై పలు ఆరోపణలు గుప్పించారు.గతంలో రాధిక సర్పంచ్ హయాంలో మంచినీళ్ళ గుంటకు మరమ్మతు చేయించారన్నారు.ఇందుకు సంబంధించి బిల్లులు కూడా మంజూరు అయిందన్నారు.అయితే ఇదే పనిని 2019లో మంచినీళ్ల కుంట పనులు చేసినట్టు బిల్లులు పెట్టడానికి ప్రస్తుతం గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వాలని ఈవో పిఆర్డి సర్పంచ్ అయినా తనను బెదిరించడం పట్ల ఆయన మండిపడ్డారు.అయితే ఈ తాటాకు చప్పులకు భయపడేది లేదన్నారు.మండలంలో 60 మంది విద్యార్థుల కంటే అధికంగా ఉన్న పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు ఎంఈఓ రవి పేర్కొన్నారు.తద్వారా కొన్ని స్కూళ్లను విలీనం చేస్తున్నామన్నారు.అయితే దీనిపై దాసుకుప్పం సర్పంచ్ రవి రెడ్డి జోక్యం చేసుకొని ఇదే జరిగితే విద్యార్థులు డ్రాప్అవుట్సు అవుతారన్నారు. తాగునీటి పైప్ లైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారినట్టు కొల్లడం ఎంపీటీసీ సెల్వి సభ దృష్టికి తెచ్చారు. పూర్తయిన గోకులాలకు బిల్లులు మంజూరు కాలేదని ఉపాధి హామీ చర్చల్లో చిన్న ఈటిపాకం సర్పంచ్ గోవిందస్వామి విన్నవించారు.తమ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వల్లే దాదాపు 38 మందికి డెంగ్యూ వ్యాధికి గురి కావడంతో ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున వైద్య ఖర్చులు అయినట్టు సంబంధిత ఎంపీటీసీ సరవన సభ దృష్టికి తెచ్చారు. తదనంతరం ఎంపీపీ సభ ఉద్దేశించి మాట్లాడుతూ మండల మీట్లో సభ్యులు లేవనెత్తుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని అధికారులు వివాదాలకు తావు లేకుండా ముందుకు వెళ్లాలన్నారు.ఈ సమావేశంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మస్తానమ్మ,ఎంపీటీసీ బాలయ్య,ఇంద్రాణి,సర్పంచులు బాబు, శివరంజని, తెలుగు గంగ డిఈ శ్రీహరి, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, మండల పరిషత్ ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, వెటర్నరీ డాక్టర్ దయాకర్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రన్, దాసుకుపం పీహెచ్సీ ఎంపీహెచ్వో సుబ్రమణ్యం, హౌసింగ్ ఇన్చార్జి ఏఈ భాను ప్రకాష్,వ్యవసాయ శాఖ ఏవో మురళి, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, సత్యవేడు పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్ పలువురు సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్ : అమరావతిలోని వెంకట పాలెం శ్రీ వేంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు కలిసి శని వారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు, టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్‌కు అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిటిడి ఛైర్మన్, బోర్డు సభ్యులు స్వాగతం పలికారు.అనంతరంరాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి ధ్వజస్తంభం, గరుడ ఆళ్వార్ వద్ద నమస్కరించి, శ్రీవారి సన్నిధికి చేరారు. స్వామివారి దర్శనం అనంతరం సన్నిధిలో అర్చన, హారతి, తీర్థాలు అందించారు. ఈ సందర్భంగా మహా మండపంలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి టిటిడి ఛైర్మన్, టిటిడి ఈవో , టిటిడి అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి నన్నపనేని సదాశివరావు, ఎం.శాంతారాం, తమ్మిశెట్టి జానకి దేవి, సుచిత్రఎల్లా,ఎస్.నరేష్‌కుమార్,జీ.భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగులు వద్దు.. కాటన్ బ్యాగులే వాడదాం: ఎంపీ దగ్గుమళ్ల

విశాలాంధ్ర – చిత్తూరు: ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు వాడాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహ కూడలి వద్ద సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జి.విద్యాధరి, మేయర్ ఎస్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత మానవహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తుందని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాల న్నారు. రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించాలన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. రోడ్లపై వ్యర్థాలు వేయరాదని, చెత్త కనిపిస్తే డస్ట్ బిన్ లో వేయాలని కోరారు. స్వచ్ఛ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా మన దేశం పాశ్చాత్య దేశాలు లాగా శుభ్రంగా ఉంటుందన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు మాట్లాడుతూవేస్ట్ మేనేజ్మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. చెత్త నుండి విజయ వంతంగా సంపద ను తయారు చేస్తున్నామని, వ్యర్థాల నుండి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు నడుస్తున్నాయన్నారు. రాజమండ్రి, నెల్లూరు, చిత్తూరు క్లస్టర్లలోనూ వ్యర్థాల నుండి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రతి జ్ఞ చేశారు. మహిళలకు కాటన్ బ్యాగులను పంపిణీ చేశారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడవద్దని, కాటన్ బ్యాగులు వాడా లని దుకాణదా రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు ఎంహెచ్వో డా. లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, నగరపాలక పారిశుద్ధ్య కార్మికులు,వార్డుకార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాలుగవ రోజు నిరాహార దీక్ష

– మోకాళ్లపై నిరసన

విశాలాంధ్ర – బుచ్చినాయుడు కండ్రిగ : మండల కేంద్రంలో తహశిల్దార్ కార్యాలయం ఎదుట శనివారం సిపిఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య నాయకత్వంలో ఇంటి స్థలాల పోరాట రిలే నిరాహార దీక్ష నాలుగవ రోజుకు చేరుకుంది. మోకాళ్ళతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కణమనంబేడు రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ లో 252,253,254,ఉన్న భూమి ఆక్రమణకు గురైంది. గ్రామంలో ఉన్న నిరుపేదలకు అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గత మూడు నెలలుగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్య వైఖరితో రిలే నిరాహార దీక్షతో సాధించడానికి సమయం ఇదేనన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాలో మహిళల భద్రత కోసం శక్తి బృందాలు ఏర్పాటు

– చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు

విశాలాంధ్ర– చిత్తూరు: మహిళల భద్రత కోసం శక్తి బృందాలు ఏర్పాటు చేసినట్లు చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. శనివారం చిత్తూరు పట్టణములోని మహిళా పోలీస్ స్టేషన్ లో శక్తి బృందాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించామన్నారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా పెడతామన్నారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. నూతనంగా చిత్తూరులో మూడు, నగిరి పలమనేరు కుప్పం సభ్యులలో ఒక్కొక్క శక్తి బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్పీ నోడల్ అధికారిగా ఉన్న ఈ టీమ్స్ లో ఎస్సై ఏ.ఎస్సై నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తా యన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ నకు వచ్చే ఎస్.ఓ. ఎస్.కాల్స్, డయల్ 112,100 కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్స్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమ త్తమై సకాలంలో సంఘటనా స్థలంనకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం చేశారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా సూచన లు చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తోట నాగరాజు, మహిళా డి.ఎస్పీ విజయశేఖర్, చిత్తూరు డి.ఎస్పి టి.సాయి నాథ్, మహిళా ఇన్స్పెక్టర్ మహేష్, ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ జయరా మయ్య, రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, ఎస్.ఐ.లు సిబ్బంది పాల్గొన్నారు.

130 కుందేళ్లు మాయం

– అటవీశాఖకు ఇచ్చామంటున్న ఆలయ అధికారులు
– అప్పగించ లేదంటున్న అటవీ శాఖ

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల తీరు అనుమానాస్పదంగా మారింది. ఆలయానికి చెందిన భరద్వాజ తీర్థం ప్రాంతంలో గంగా సదన్ అతిథి గృహం ఉంది. ఈ అతిథి గృహానికి ఎదురుగా కుందేళ్ల పెంపకం చేపట్టారు. వాటి కోసం ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డు కూడా ఉంది. వీటికోసం అన్నదానానికి వచ్చే కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు, క్యారెట్, క్యాబేజీ ఆకులను ప్రతిరోజు మేతగా వేసేవారు. ఇందుకోసం సిబ్బంది కూడా ఉన్నారు. అయితే నిర్వహణ భారం అనుకున్నారో, లేక కుందేళ్ళకు వచ్చిన వ్యాధిని నివారించలేక పోయారో తెలియదు గానీ 130 కుందేళ్ళను అటవీశాఖ వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకొని మూడు రోజుల క్రితం ఇచ్చేశామని సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక అటవీ క్షేత్రాధికారి లోకేష్ ను అడగ్గా కుందేళ్ళ అప్పగింత విషయం చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే స్వాధీనం చేసుకొని అడవిలో వదిలి పెడతామని అన్నారు. దేవస్థానం సిబ్బంది అటవీ శాఖ వారికి ఇచ్చేశామని సమాధానం చెబుతున్నారు. షెడ్డులో ఉండాల్సిన కుందేళ్లు లేవు. అప్పగింతలు జరగలేదని అటవీశాఖ అధికారులు అంటున్నారు. మరి కుందేళ్లు ఏమయ్యాయో ఎవరికీ అర్థం కావడం లేదు. కుందేళ్ళ పెంపకంలో కూడా ఎన్నో మతలబులు ఉన్నట్టు వెలుగులోకి వస్తున్నాయి. ఎవరైనా ఉత్సాహ వంతులు వెళితే వారికి ఉచితంగా కుందేళ్ళను ఇచ్చినట్లు చెబుతున్నారు. పెంపకానికి ఉచితంగా ఇవ్వాలని ఎవరు చెప్పారో ఎందుకు తెలియదు. ఎన్ని కుందేళ్ళను ఉచితం పేరుతో ఎవరికిచ్చారో వివరాలు లేవు. లేక ఉచితం పేరుతో స్వాహా చేశారో కూడా తెలియదు. చర్మ సంబంధమైన వ్యాధులు రావడంతో వాటిని అటవీ శాఖ వారికి అప్పగించాలని నిర్ణ నిర్ణయించినట్లు దేవస్థానం సిబ్బంది చెబుతున్నారు. మూడు రోజుల క్రితమే అటవీ శాఖ సిబ్బందికి అప్పగించామని అంటున్నారు. దేవస్థానం వారు తమకు ఇంకా అప్పగించలేదని అటవీ అధికారి స్పష్టం చేశారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 130 కుందేళ్లు ఏమయ్యాయనేది చర్చనీయాంశం అయింది.

శరీరం చెప్పినట్టు వినాలి

– ప్రకృతి వ్యవసాయ నిపుణులు ప్రకృతివనం ప్రసాద్
– శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమకు జ్ఞాపిక ప్రదానం

విశాలాంధ్ర – తిరుపతి: రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజసిద్ధంగా పండే ఆహారం ఎంతో శ్రేష్ఠమైందని, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో శరీరం చెప్పినట్టు వినాలని ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు ప్రకృతి వనం ప్రసాద్ తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సావేరి హాల్లో సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమకు జ్ఞాపిక ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ ఉపవాసం ప్రాధాన్యతను వివరించారు. చక్కటి శారీరక శక్తికి తృణధాన్యాలతో పాటు రాగులు, సజ్జలు విరివిగా వాడాలని సూచించారు. సాయంకాలం వేళల్లో త్వరగా భోజనం చేయాలని, గూట్లో దీపం నోట్లో ముద్ద అన్న నానుడిని పాటించాలని కోరారు. వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకుని శుద్ధి చేసుకుంటే మంచి మినరల్ వాటర్ దొరుకుతుందన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్ చెప్పినట్టు మరో వెయ్యేళ్లలో భూమి మొత్తం నిస్సారం అవుతుందని, ఈ పరిస్థితి రాకుండా ఇప్పటి నుండే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ తెల్లవారుజామునే నిద్ర లేచి చెమట పట్టేలా వ్యాయామం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధునిక ఆహార అలవాట్లను పునఃపరిశీలించుకోవాలని సూచించారు.జెసిఐ జోన్ ఛైర్మన్ గోపి కిషోర్ మాట్లాడుతూ మానవుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం భూమిని రసాయనాల బారి నుండి రక్షించాలన్నారు. జెసిఐ ఆధ్వర్యంలో 20 ఏళ్ల నుండి 40 ఏళ్ల లోపు యువతీ యువకులకు మానసిక వికాసానికి సంబంధించిన శిక్షణ అందిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ పీఆర్వో రజనీ, పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ శ్రీనివాసరావు, సెక్రటరీ దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, జెసిఐ జోన్ వైస్ ఛైర్మన్ జి.శంకర్, సెక్రటరీ సోమయ్య, పిఆర్ఎస్ఐ పూర్వ ఛైర్మన్లు డా. స్వరాజ్యలక్ష్మి, ఆచార్య త్రిపురసుందరి, నగరవాసులు పాల్గొన్నారు.